

బీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కోనేరుసెంటర్(మచిలీపట్నం): బీఈడీ, స్పెషల్ బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ కె.రాంజీ బుధవారం విడుదల చేశారు. 1,118 మంది ఉత్తీర్ణులయ్యారు.



తిరుపతమ్మ సేవలో సోము వీర్రాజు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మను బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి సోము వీర్రాజు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహరి (శుక్ర)
విజయవాడ	6.22	4.59
మచిలీపట్నం	6.21	4.57

న్యూస్‌రీల్

పీ4 సర్వేతో ప్రతి గృహానికి లబ్ధి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యం (పీ4) సర్వేతో ప్రతి ఇంటికి అభివృద్ధి చేకూరుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం తన చాంబర్‌లో ప్రణాళిక శాఖ రూపొందించిన అవగాహన, క్యూఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర: 2047 దిశగా ముందుకు వెళుతుందన్నారు. దీనిలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ విలువైన అభిప్రాయాన్ని స్వర్ణాంధ్ర వెబ్ సైట్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా అందజేయాలని, అందుకు ఈనెల 25 వరకు ప్రజల భాగ స్వామ్య, సంప్రదింపు కాల పరిమితిగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.కన్నమ్మ నాయుడు, సీపీఓ శ్రీలత, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ/వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీపీఓ లావణ్యకుమారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయకుమారి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంక్‌లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): సూర్యారావుపేలోని చిగురుపాటి మంజువాణి వరప్రసాద్ లయన్స్ డిస్ట్రిక్ట్ 316 బ్లడ్ బ్యాంకులో ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ అధికారి డాక్టర్ జె.ఉషారాణితో కలిసి బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉన్న రక్తం యూనిట్లు, రక్తం నిల్వలకు అనుసరించాల్సిన నియమ నిబంధనలను పరిశీలించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.

ఎన్టీటీపీఎస్ బూడిదకు టెండర్లు

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ బూడిద అక్రమ వ్యాపారంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆ సంస్థ ఉన్నతాధికారులు స్పందించారు. చెరువులో బూడిద నిల్వలను టెండర్ ద్వారా విక్రయించడం ఉత్తమ మార్గమనే నిర్ణయానికి వచ్చారు. గత నెల రెండో తేదీన 'బూడిదలో కాసుల వేట' పేరుతో 'సాక్షి'లో కథనం వెలువడింది. అప్పట్లోనే ఈ అంశంపై విజిలెన్స్ అధికారులు ఎన్టీటీపీఎస్ అధికారుల నుంచి రాతపూర్వక వివరణ తీసుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ల స్థాయిలో సమావేశం నిర్వహించి టెండర్ వైపు మొగ్గుచూపారు. ఈ నేపథ్యంలో ఏపీ జెన్‌కో అధికారులు రూ.150 కోట్ల అంచనాలతో మూడేళ్ల కాలానికి టెండర్లు పిలిచారు. వార్షిక ఆదాయం రూ.400 కోట్ల టర్నోవర్ ఉన్న సంస్థలు టెండర్‌లో పాల్గొనే హక్కు కల్పించారు. ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టెండర్‌లు దాఖలు చేసుకునే అవకాశం కల్పించారు. 26వ తేదీన టెండర్లు ఓపెన్‌చేసి కేటాయింపులు చేస్తారు. ఏప్రిల్ ఒకటి నుంచి టెండర్‌దారుడు బూడిద సేకరించే అవకాశం ఇస్తారు. 'సాక్షి' కథనంతో బూడిద అక్రమార్కులకు చెక్ పెట్టడంతో పాటు జెన్‌కో సంస్థకు ఆదాయం సమకూరనుంది.

యువ ఆగ్రహ జ్వాల

కూటమి ప్రభుత్వ మోసాలపై కన్నెర్రజేసిన యువత

ఎన్నికల హామీల అమలులో మాటతప్పిన కూటమి ప్రభుత్వ తీరుపై యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రభుత్వం ఆంక్షలు విధించినా.. పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా లెక్క చేయలేదు. లాఠీలు ఝులిపించినా వెనక్కు తగ్గలేదు. విజయవాడలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరులో విద్యార్థులు, నిరుద్యోగులు, యువతీయువకులు పాల్గొని కదం తొక్కారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, విద్యాదీవెన, నిరుద్యోగ భృతి చెల్లించాలని, డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని నినదించారు.

- యువత పోరుకు వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు, విద్యార్థులు
- పోలీసు నిర్బంధాలను దాటుకుని కలెక్టరేట్‌కు చేరుకున్న వైనం
- కూటమి ప్రభుత్వానిది దుర్మార్గపు పాలన : దేవినేని అవినాష్



యువత పోరులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు



నిరుద్యోగులు, యువతీయువకులు, విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, విద్యా దీవెన, నిరుద్యోగ భృతి అమలుచేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన యువత పోరుకు విశేష స్పందన లభించింది. యువత పోరులో విద్యార్థులు, యువతీయువకులు, తల్లిదండ్రులు, మహిళలు కదం తొక్కారు. విజయవాడలోని కలెక్టరేట్‌కు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చారు. కోర్టు సెంటర్‌లోని సీవీఆర్ స్కూల్ నుంచి మ్యూజియం రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీసులు అడుగడుగునా నిర్బంధాలు విధించినా ఛేదించి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలపై కన్నెర్ర జేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించాలని, డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ర్యాలీలో పాల్గొన్న అవినాష్, వెలంపల్లి శ్రీనివాస్, మొండితోక జగన్‌మోహనరావు, స్వామిదాసు తదితరులు

అడుగడుగునా అడ్డంకులు



యువత పోరు ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

యువత పోరుకు పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. మ్యూజియం రోడ్డులో నాలుగు చోట్ల బారికేడ్లు ఏర్పాటుచేసి కలెక్టరేట్‌కు వెళ్లకుండా యువతీయువకులను అడ్డుకున్నారు. కొందరు పోలీసులు విద్యార్థులపై లాఠీలు ఎత్తారు. తోపులాటలో మహిళలు కింద పడిపోయారు. కలెక్టరేట్ గేట్లు వేసి మరీ లోపలికి ఎవరిని వెళ్లకుండా అడ్డుకున్నారు. నాయకులను సైతం నిలిపివేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రులు జోగి రమేష్, వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, మొండితోక జగన్‌మోహన్‌రావు, తిరువూరు, జగ్గయ్యపేట నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు నలగట్ల స్వామిదాసు, తన్నీరు నాగేశ్వరరావు కలెక్టరేట్‌కు చేరుకుని డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంనకు వినతి పత్రం అందజేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజ, బెల్లం దుర్గ, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పూనూరు గౌతంరెడ్డి, అడపా శేషు, షేక్ ఆసిఫ్, పోతిన వెంకటమహేష్, అవుతు శ్రీనివాసరెడ్డి, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



డీఆర్వో లక్ష్మీనరసింహంనకు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మ్యూజియం వద్ద బారికేడ్లను తోసుకుని వస్తున్న నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగులు

అవమాన భారంతో రోడ్డెక్కిన విద్యార్థులు



యువత పోరును ఉద్దేశించి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ విద్యార్థులు, నిరుద్యోగ యువత, మహిళలకు ఎన్నో హామీలిచ్చారని గుర్తుచేశారు. రూ.3 వేల నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, అమ్మకు వందనం పేరుతో ఒక్కొక్క విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఊదరగొట్టి, అధికారంలోకి రాగానే ఆ హామీలను విస్మరించారని మండిపడ్డారు. ఐదు త్రైమాసికాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థు లపై వత్తిడి చేస్తున్నాయని, విద్యార్థులు అవమానభారంతో రోడ్డెక్కాల్సి వచ్చిందని పేర్కొ న్నారు. వైఎస్ జగన్ హయాంలో ప్రతి మూడు నెలలకో సారి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేశారని, క్రమం తప్పకుండా అమ్మ ఒడితో ఆదుకున్నారని గుర్తుచేశారు. పది నెలల కూటమి పాలన చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, మహిళలకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.



కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని నిరసిస్తూ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

నట్టేట ముంచారు



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఒక మాట తర్వాత మరొక మాట చెప్పి విద్యార్థులను రోడ్డున పడేసింది. ఏ ప్రభుత్వం వచ్చినా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేయాలి. కూటమి ప్రభుత్వం పది నెలలుగా అవేమీ అమలు చేయకుండా విద్యార్థులు, యువతను నిర్లక్ష్యం చేసింది. అన్ని వర్గాలను నట్టేట ముంచింది. వారందరికీ అండగా నిలుస్తాం.

– వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ మంత్రి

దుర్మార్గంగా వ్యవహరిస్తోంది



విద్యార్థులు, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత విషయంలో కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టింది. ఎన్నికల ముందు ఉద్యోగాలిస్తామని, ఇవ్వలేకపోతే రూ.3 వేల భృతి అని నమ్మించింది. ఆ తర్వాత ఆ హామీని పట్టించుకోవడం లేదు. డీఎస్సీ అంటూ తొలి సంతకం చేసి, ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసింది.

– జోగి రమేష్, మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి

బటన్ ఎందుకు నొక్కడం లేదు?



వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా వైఎస్ జగన్ బటన్ నొక్కి పేదలకు లబ్ధిచేకూర్చారు. ఆనాడు ఎవరైనా బటన్ నొక్కుతారని కూటమి నాయకులు విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బటన్ ఎందుకు నొక్కడం లేదు? పేదలకు సేవ చేయాలంటే చిత్తశుద్ధి, దమ్మూ ధైర్యం కావాలి. గుంతలు లేని రోడ్లు వేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల కళ్లకు గంతలు కడుతోంది.

– మొండితోక జగన్‌మోహన్‌రావు, నందిగామ మాజీ ఎమ్మెల్యే

కాపీ కొట్టడం తప్ప చేసిందేమీలేదు



అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వ నిజ స్వరూపం బయటపడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పథకాల పేర్లు కాపీ కొట్టడం తప్ప చేసిందేమీ లేదు. అమ్మ ఒడిని తల్లికి వందనం, దిశ యాప్‌ను శక్తి యాప్‌గా మార్చి తమ ఘనత అంటూ ఊదరగొడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరు చెబితే వైఎస్సార్, వైఎస్ జగన్ మాత్రమే గుర్తుకు వస్తారు.

– మల్లాది విష్ణు, విజయవాడ సెంట్రల్

హామీలు అమలు చేయాలి



ఎన్నికల ముందు నిరుద్యోగులు, విద్యార్థులు, యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయడం లేదు. రైతులకు మద్దతు ధర కల్పించలేదు. ఆరోగ్య శ్రీని నీరు గారుస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలి. లేని పక్షంలో వైఎస్సార్ సీపీ పోరాటాల ద్వారా ప్రభుత్వం మెడలు వంచుతుంది.

– నల్లగట్ల స్వామి దాసు, తిరువూరు

ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా యువత పోరు చేపట్టాం. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, నిరుద్యోగ భృతి, ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి. హామీలన్నింటిని అమలు చేయాలి. లేని పక్షంలో ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాడుతాం.

– ఎ.రవిచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ విద్యార్థి విభాగం

ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా

- ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- అన్ని నియోజకవర్గాల్లో వేడుకలు
- వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పించిన నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రమైన విజయవాడతోపాటు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు పార్టీ జెండాలను ఎగురవేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా అని పార్టీ నాయకులు స్పష్టంచేశారు.

ప్రజల కోసం పనిచేద్దాం

సమస్యలు తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తూ వైఎస్సార్ సీపీ నిరంతరం ప్రజలకు అండగా నిలుస్తోందని పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతకాలను ఎగరవేసి, కేక్‌లుకట్ చేశారు.



గుణదలలోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న దేవినేని అవినాష్ తదితరులు

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో..

గుణదలలోని ఎన్టీఆర్ జిల్లా, తూర్పు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, పశ్చిమ ఇన్‌చార్జి వెల్లంపల్లి శ్రీనివాస్, తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, పీఏసీ మెంబర్ షేక్ ఆసీఫ్, పార్టీనేత పోతిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ సెంట్రల్‌లో..

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం బీసెంటు రోడ్డులో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే, పార్టీ సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కేక్‌కట్ చేశారు. సత్యనారాయణపురంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



బీసెంట్‌రోడ్డులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విజయవాడలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెలంపల్లి , మేయర్ భాగ్యలక్ష్మి

విజయవాడ వెస్ట్‌లో...

వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెస్ట్ ఇన్‌చార్జి వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మైలవరంలో...

ఇబ్రహీంపట్నం రింగ్‌సెంటర్‌లో మాజీ మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని జోగి రమేష్ ఎగురవేశారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేటలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కేక్‌కట్‌చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగామలో...

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం నందిగామలో ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మొండితోక జగన్మోహనరావు పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు టౌన్‌పార్టీ అధ్యక్షుడు చలమల సత్యనారాయణ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో నగర పంచాయితీ చైర్‌పర్సన్ కస్తూరిబాయి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

- ఇసుక అక్రమ రవాణాపై మైనింగ్ అధికారుల దాడి
- 24 ట్రాక్టర్లు, 18 క్రేన్‌లు, 10 పడవలు సీజ్

ఇబ్రహీంపట్నం: ఫెర్రీ వద్ద కృష్ణానది గర్భంలో యథేచ్ఛగా ఇసుక తవ్వి తరలిస్తున్న ఇసుకాసురులపై మైనింగ్ అధికారులు బుధవారం మెరుపుదాడి చేశారు. మైనింగ్ ఏడీ వీరాస్వామి నేతృత్వంలో జరిగిన దాడిలో అనుమతులు లేకుండా కృష్ణానదిలో డ్రెడ్జింగ్ యంత్రాలతో ఇసుక తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్న పది పడవలు, 24 ట్రాక్టర్లు, 18 మ్యాన్యువల్ క్రేన్‌లను సీజ్‌చేశారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను పోలీస్ బందో బస్తు నడుమ స్థానిక ఆర్టీసీ డిపో వద్దకు తరలించారు. ట్రాక్టర్లు, పడవలు, క్రేన్‌ల డ్రైవర్లపై కేసులు నమోదుపై పోలీస్‌లకు రిపోర్ట్ చేశారు.

కూటమి నేతల మాటల యుద్ధం

అక్రమ రవాణా అడ్డుకున్న మైనింగ్ అధికారులపై కూటమి నేతలు మాటల యుద్ధానికి దిగారు. బీసీ నాయకుడిగా చలామణీ అవుతున్న ఒకరు ట్రాక్టర్ డ్రైవర్లు, పడవల యజమానుల తరఫున మైనింగ్ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించాడు. 'ప్రభుత్వం మాది. మా అధినేత ఉచితంగా ఇసుక తీసుకెళ్లమన్నారు. అపడానికి మీరెవరు?' అంటూ రెచ్చిపోయారు. మైనింగ్ ఏడీ వీరాస్వామి వెనక్కు తగ్గక పట్టుబడిన ట్రాక్టర్లు, పడవలు, క్రేన్‌లను సీజ్ చేశారు.



ఇసుక రవాణా చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్న మైనింగ్ ఏడీ వీరాస్వామి



ఇసుక రేవులో సీజ్ చేసిన మ్యాన్యువల్ క్రేన్‌లు

అనుమతులు లేవు

మైనింగ్ ఏడీ వీరాస్వామి మాట్లాడుతూ.. పడవలు, ట్రాక్టర్లు, క్రేన్‌ల యజమానుల వద్ద ఇసుక తవ్వకాలు, రవాణాకు అనుమతులు లేవన్నారు. ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను సీజ్‌చేశామని పేర్కొన్నారు. యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టంచేశారు. ఆర్‌ఐ శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆందోళనలో చిన్న, మధ్య తరగతి కాంట్రాక్టర్లు

- బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం మొండిచేయి
- నేడు మంగళగిరిలో సమావేశం కానున్న కాంట్రాక్టర్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మార్చి నెల ముగుస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపులు చేసేందుకు ఎలాంటి స్పందన లేక పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిన్న, మధ్య తరగతి కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో భవిష్యత్‌పై చర్చించేందుకు ఈ నెల 13న గురువారం మంగళగిరిలోని మధు కళామండపంలో సమావేశం కావాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లు నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లందరూ సంసిద్ధులై కదలి వస్తున్నారని తెలిపారు. జనవరిలో ముగ్గురు సహచరులను కోల్పోయామని, ఆ సంఖ్య మరింత పెరగకుండా చూడాల్సిన అవసరం, సభ్యుల భవిష్యత్తు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీఏఐ, స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్లపై ఉందని నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.

డప్పు కళాకారుల సమస్యలపై 18న ధర్నా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): డప్పు కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.క్రాంతికుమార్ చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్ సమీపంలో ఉన్న పూలే, అంబేడ్కర్ భవన్‌లో డప్పు కళాకారుల సంఘం సభ్యుల సమావేశం బుధవారం జరిగింది. క్రాంతికుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా డప్పు కళాకారుల సంక్షేమంపై దృష్టి పెట్టలేదన్నారు. సర్వేల పేరుతో డప్పు కళాకారుల పెన్షన్లు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పెన్షన్ అర్హత వయసును 45 సంవత్సరాలకు తగ్గించడమే కాకుండా పెన్షన్‌తో సంబంధం లేకుండా డప్పు కళాకారులందరికీ డప్పు, గజ్జెలు, డ్రస్సులు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. గతంలో మాదిరిగా డీపీఆర్వో కార్యాలయాల్లోనే గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాల ప్రచారంలో భాగస్వామ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బి.కరుణాకర్, హనుమయ్య, నాగరాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనే పల్లెలకు రక్ష

- సారా రక్కసికి బలైపోతున్న కుటుంబ వ్యవస్థ
- సారాను శాశ్వతంగా నిర్మూలించాలంటున్న ప్రజలు
- నిరంతర నిఘా, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలే నిర్మూలనకు సోపానాలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: పల్లెల్లో విజృంభిస్తున్న నాటుసారాకి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతోంది. సారా తయారు చేస్తున్న కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతున్నప్పటికీ సారా తాగి ఎన్నో పేద కుటుంబాలు కుటుంబ సభ్యులను కోల్పోయి, ఆర్థికంగా నష్టపోయి విచ్ఛిన్నమవుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు నియోజకవర్గ పరిధిలో దశాబ్దాలుగా జరుగుతున్న ఈ అక్రమ దందాకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసినప్పటికీ గత తొమ్మిది నెలలుగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నాటుసారా తయారీ, విక్రయాలు



తిరువూరు నియోజకవర్గంలో సారా ఊటను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

జోరందుకున్నాయి. సారా శాశ్వత నిర్మూలనతోనే పల్లెల్లో వెలుగులు నిండుతాయని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గిరిజన తండాలే ఆవాసాలు

తిరువూరు నియోజకవర్గంలోని విసన్నపేట, గంపలగూడెం, ఏ కొండూరు మండలాల పరిధిలోని గిరిజన తండాల్లోనే ఈ నాటుసారా తయారీ యథేచ్ఛగా సాగుతోంది. కూలీ పనులకు వెళ్లేవారు నాటుసారా తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకున్నారు. ఈ తండాల్లో అటవీ ప్రాంతాలు, మామిడి తోటలతో పాటు ఇళ్ల ప్రాంగణాల్లోనే పెద్ద పెద్ద ప్లాస్టిక్ డ్రమ్ములను భూమిలో పాతిపెట్టి బెల్లం ఊటను నిల్వ చేస్తున్నారు. ఇళ్లలోనే సారా తయారీ చేసే స్థాయికి వెళ్లారంటే ప్రభుత్వ నిఘా ఏస్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతోంది. ఇప్పటికే ఏ కొండూరు మండల పరిధిలో కిడ్నీ వ్యాధి స్థానికులను వణికిస్తున్న క్రమంలో సారా తయారీ, విక్రయాలు భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి.

గ్రామ కమిటీలు, ప్రత్యేక అధికారుల ఏర్పాటు..

సారా ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేశామని ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఒక్కొక్క గ్రామానికి అడక్షన్ ఆఫీసర్లుగా, హెడ్ కానిస్టేబుల్, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను నియమించాం. సారా తయారీదారులపై పూర్తిగా దృష్టి పెట్టాం. గ్రామ స్థాయిలో అడక్షన్ కమిటీలో గ్రామ పెద్దలు, అడక్షన్ అధికారి, వీఆర్వో, వీఆర్ఏ, గ్రామ మహిళ కార్యదర్శులు, యూత్ ఆర్గనైజేషన్ సభ్యులను కమిటీలో సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ప్రజా ప్రతినిధులు, ఉంటారు. వీరు నెలకు ఒకసారి సమావేశమై, అంతకు ముందు జరిగిన నేరాలు, రాబోయే రోజుల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి, తదనుగుణంగా నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తారు.

పూర్తిగా రూపుమాపుతాం..

రెండు, మూడు నెలలో ప్రణాళికబద్ధంగా సారాను పూర్తిగా రూపుమాపుతాం. ప్రధానంగా గ్రామ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి, సారా తాగడం వలన కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లు వివరిస్తూ, వారిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. కళాజాత బృందాల ద్వారా అవగాహన కలిగించే విధంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నాం. తిరువూరు నియోజకవర్గంలో 103 కేసులు నమోదుచేసి, 15 మందిని అరెస్టు చేశాం. 26 వేల లీటర్ల ఊటను ధ్వంసం చేశాం. గ్రామాల్లో సైతం విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. దాడులను మరింత ఉధృతం చేస్తాం.

సారా నిర్మూలనకు సూచనలు

- స్థానిక ఎక్సైజ్‌శాఖ అధికారులు అవినీతికి పాల్పడకుండా నిస్వార్థంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.
- సారా తయారు చేసే వారిపై కఠినమైన శిక్షలు అమలు చేయాలి.
- సారా తయారీ, విక్రయాలు, తాగడం వల్ల కలిగే నష్టాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలి.
- సారా తయారు చేస్తున్న పల్లెల్లో గ్రామానికి చెందిన చదువుకునే యువకులనే వలంటీర్లుగా నియమించుకొని అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలి.
- సారా తయారీదారులకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధుల సహకారంతో రాయితీలపై రుణాలు ఇప్పించి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపాలి.
- సారా తయారీ, విక్రయాల వల్ల కేసులు నమోదై సమాజంలో ఆ కుటుంబానికి చెందిన పిల్లలు ఎదుర్కొనే ఇబ్బందులను వివరించాలి.
- నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన నవోదయం కార్యక్రమాన్ని సమగ్రంగా అమలు చేయాలి.

సారా తయారీకి అడ్డుకట్ట !

– ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు



నాటు సారా తయారీకి అడ్డుకట్ట వేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ డీసీ టి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాక్షితో ప్రచురితమైన 'సారా ఏరులు !' అనే వార్తపై ఆయన స్పందించారు. సారాను పూర్తిగా రూపుమాపేందుకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను వివరించారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా ఉమ్మడి కృష్ణా జిల్లాలో 40 సారా ప్రభావిత గ్రామాలను గుర్తించామన్నారు. ఈ గ్రామాలను ఏ, బీ, సీ మూడు కేటగిరిలుగా విభజించి స్పెషల్ డ్రైవ్ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో సారా కాపు కాసి, తాగడంతో పాటు, ఇతర గ్రామాలకు సారా సరఫరా చేసే గ్రామాన్ని ఏ కేటగిరిగా, గ్రామంలోనే సారా కాసి, తాగే గ్రామాన్ని బీ కేటగిరిగా, బయట గ్రామాల నుంచి సారా తెచ్చుకొనే తాగే గ్రామాన్ని సీ కేటగిరిగా విభజించామన్నారు.

అవగాహన కల్పించాలి



సారా తాగడం వలన కలిగే అనర్థాలు వివరిస్తూ ఎక్సైజ్ అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఏ కొండూరు మండలంలో సారాకు బానిసలై కిడ్నీ వ్యాధిబారిన పడిన వారి గురించి వివరించి సారా మానాలని తెలియజేస్తే ఫలితం ఉంటుంది. – డి.ఆనందరావు, సామాజిక కార్యకర్త, తిరువూరు

సారా అనర్థాలు ప్రచారం చేయాలి



సారాలో కలిపే ప్రమాదకరమైన రసాయనాలతో ఆరోగ్యానికి చేకూరే నష్టాలను తెలుపుతూ ఎక్సైజ్ శాఖ విస్తృత ప్రచారం చేయాలి. మద్యం ధరలు అందుబాటులో లేక సారాకు అలవాటు పడిన వారిలో మార్పుకు ఈ ప్రచారం దోహదపడుతుంది. – ఎం.ఉదయ్, స్థానికుడు, తిరువూరు

దేనికైనా తెగిస్తారు..



సారా లాంటి మత్తు పానీయాలకు అలవాటు పడిన వారు దేనికైనా తెగిస్తారు. దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, రేప్‌లు వంటి నేరాలకు నిర్భయంగా పాల్పడతారు. ప్రస్తుతం జరుగుతున్న నేరాల్లో 95 శాతం మత్తులో చేసినవేనని లెక్కలు చెబుతున్నాయి.
– డాక్టర్ గర్రే శంకరరావు, సైకాలజిస్ట్

అవయవాలపై తీవ్ర ప్రభావం



సారాయి వంటి మత్తు పానీయాలు సేవించడం వలన శరీరంలోని అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా లివర్, నరాలు, బ్రెయిన్‌పై అధిక ప్రభావం ఉంటుంది. అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. లివర్ క్యాన్సర్‌తో పాటు, ఇతర క్యాన్సర్‌లు సోకవచ్చు.
– డాక్టర్ మనోజ్‌కుమార్, జనరల్ మెడిసిన్ నిపుణులు

వాట్సాప్ ద్వారా ఓపెన్ టెన్త్ హాల్ టికెట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఈ నెల 17 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను పొందవచ్చని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు తెలిపారు. స్టడీ సెంటర్ల కో ఆర్డినేటర్లు ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ నుంచి విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకోవచ్చన్నారు. అలాగే విద్యార్థులు మన మిత్ర యాప్ ద్వారా తమ వివరాలను నమోదు చేసి హాల్ టికెట్లను పొందవచ్చని తెలిపారు. అలాగే 95523 00009 నంబర్‌కు హెచ్ఐ అనే సందేశాన్ని పంపి ఇతర ఆప్షన్లను ఎంపిక చేసుకొని హాల్ టికెట్లను పొందవచ్చని తెలిపారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 312 మంది గైర్హాజరు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి బుధవారం జరిగిన పరీక్షకు 312 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాల్లో 1,325 మంది విద్యార్థులను కేటాయించగా అందులో 1,013 మంది హాజరయ్యారు. నగరంలోని బీఎస్ఆర్‌కే ఎంసీ స్కూల్, గాంధీజీ హైస్కూల్, ఏపీఎస్ఆర్ఎం ఎంసీ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను డీఈవో సుబ్బారావు పరిశీలించారు. జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు, విజయవాడ పరీక్ష కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్లు పర్యవేక్షించాయి.

మెబాజ్‌లో తారల సందడి



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ బందర్ రోడ్డులోని ఎత్నిక్ ఫ్యాషన్, విలాసవంతమైన డిజైనర్ వెడ్డింగ్ వేర్ మెబాజ్‌లో బుధవారం తారలు సందడి చేశారు. ప్రముఖ నటులు వర్షిణి సౌందరరాజన్, ప్రీతి సుందర్, జగదీష్‌లు హాజరై కొత్త వివాహ సంకలనాన్ని ఆవిష్కరించారు. వధువుల లహంగాలు, రాజసమైన షేర్వానీలు ధరించి సందడి చేశారు. వారిని చూసేందుకు అభిమానులు తరలివచ్చారు. వివాహ సీజన్‌ల సందర్భంగా కళాత్మకమైన వెడ్డింగ్ డిజైనర్స్ అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు.

అత్యంత కచ్చితత్వంతో రీ సర్వే



కంచికచర్ల మండలం గండేపల్లిలో భూముల రీ సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కంచికచర్ల: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూ యజమానుల సమక్షంలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీ తనంతో భూముల రీ సర్వే పనులు జరుగుతున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. కంచికచర్ల మండలం గండేపల్లిలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను ఆయన బుధవారం పరిశీలించారు. గ్రామం పరిధిలో సర్వే పురోగతిని రికార్డుల ఆధారంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. రీ సర్వేలో కచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. రీ సర్వే బృందాలు షెడ్యూల్ ప్రకారం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ సభల నిర్వహణ, ప్రజలకు అవగాహన కల్పించే విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాలను భూ వివాద రహితంగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న రీ సర్వేపై క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్(సర్వే, భూ రికార్డులు) టి.త్రివిక్రమరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ వి.మానస, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సర్పంచి బి.రవికుమార్, ఏపీఓ రమాదేవి, వీఆర్వో రవికుమార్, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళాలు



ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు బుధవారం విరాళాలను అందజేశారు. విజయవాడ పటమటకు చెందిన గొట్టిపాటి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసిన వెంకటరమణ తన పేరిట రూ. 1,00,116లు, గొట్టిపాటి అరుణ కుమారి పేరిట రూ.1,00,116ల విరాళాలను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు దాతకు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు లబ్ధి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు లబ్ధి చేకూరుస్తోందని, దీనిని వినియోగించుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ, పట్టణ) 1.0 కింద గృహ నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అదనంగా వివిధ వర్గాల వారికి ప్రయోజనం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 09 విడుదల చేసిందన్నారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, పీవీటీజీ(పర్వత ప్రాంత షెడ్యూల్ తెగలు)లకు రూ.లక్ష అదనపు సాయం అందిస్తామన్నారు. ఎస్సీలకు ఇప్పటికే 3,822 ఇళ్లు, ఎస్టీలకు 556 ఇళ్లు, బీసీలకు 4,018 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్, ఆపై దశలో ఉన్నాయని తెలిపారు. వీరితో పాటు మిగిలిన లబ్ధిదారులు కూడా రూ.1.80 లక్షల యూనిట్ విలువకు అదనంగా ప్రభుత్వం కొత్తగా అందించే అదనపు మొత్తాన్ని ఉపయోగించుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు.

15 నుంచి స్పెషల్ డ్రైవ్

ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారులకు కూడా అవగాహన కల్పించి వడివడిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తిచేసుకునేలా ఈ నెల 15వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ అమెనిటీ సెక్రటరీలు తదితరులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. మీడియా సమావేశంలో గృహ నిర్మాణ పీడీ ఆర్.లీలారాణి, డీఈ విజయబాబు, ఈఈ జి.కపూర్ పాల్గొన్నారు.

దుర్గగుడిలో బయోమెట్రిక్ గందరగోళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పని చేయని బయోమెట్రిక్ మిషన్ల కారణంగా తమ వేతనాలు కోతకు గురవుతున్నాయని ఆలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్గగుడిలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అందరికీ ఫిబ్రవరి నెల నుంచి బయోమెట్రిక్ హాజరును ప్రామాణికంగా తీసుకుంటామని ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బయోమెట్రిక్ నమోదు అయిన రోజుల వరకే వేతనాలు జమవుతాయని దేవస్థాన అధికారులు ముందుగానే హెచ్చరించారు. అయితే బయోమెట్రిక్‌పై కొంత మంది సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడం, కొన్ని సమయాల్లో బయోమెట్రిక్ మిషన్లు సరిగా పని చేయకపోవడంతో అధిక మొత్తం సిబ్బంది హాజరులో కోత పడింది. ఫిబ్రవరి నెల పూర్తి స్థాయిలో విధులు నిర్వహించినప్పటికీ అనేక మందికి నెలలో నాలుగు నుంచి ఆరు రోజుల తక్కువగా వేతనం బ్యాంక్ ఖాతాలో జమ కావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. మార్చి నెలలో పిల్లల ఫీజులు, ఇతర ఖర్చుల నేపథ్యంలో వేతకాల కోసం ఎదురు చూస్తున్న ఆలయ సిబ్బంది బ్యాంక్ ఖాతాలో జమ వేతనాలను చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని చేయని మిషన్లు..

దేవస్థానంలో విధులు నిర్వహించే సిబ్బంది కోసం మొత్తం ఆరు ప్రాంతాల్లో బయోమెట్రిక్ మిషన్లు ఏర్పాటు చేశారు. మహా మండపం దిగువన టోల్‌ఫ్రీ కౌంటర్, నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్, ఏడో అంతస్తులోని మైక్ ప్రచార కేంద్రం, శృంగేరీ అన్నదాన భవనం, కేశ ఖండనశాల, మాడపాటి సత్రాలలో మిషన్లు ఏర్పాటు చేశారు. సిబ్బంది తమ తమ మొబైల్‌లో సైతం బయోమెట్రిక్ హాజరు వేసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. విధులకు హాజరైన సిబ్బంది ఆలయ ప్రాంగణంలో ఎక్కడి నుంచైనా బయోమెట్రిక్ హాజరు వేసుకునే వీలు ఉంది. మొబైల్‌లో బయోమెట్రిక్ వేయడంలో అనేక మందికి అవగాహన లోపానికి తోడు కొండపై సిగ్నల్ సమస్య మరో ప్రధాన కారణంగా ఆలయ సిబ్బంది పేర్కొంటున్నారు. బయోమెట్రిక్ మిషన్లు తరుచూ మరమ్మతులకు గురి కావడంతో పాటు ఇంటర్నెట్ సమస్య ఎదురవుతోంది. బయోమెట్రిక్ మిషన్లు పూర్తి స్థాయిలో పని చేసేలా చూడాల్సిన బాధ్యత ఆలయ అధికారులపై ఉందని సిబ్బంది చెబుతున్నారు. వేతనాల కోత పడటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు గతంలో ఎన్నడూ లేని విధంగా 10వ తేదీ తర్వాతే వేతనాలు బ్యాంక్‌లో జమ చేయడంతో సిబ్బంది మరింత ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ప్రతి నెలా రెండు, మూడు తేదీల్లో పడే వేతనాలు మూడు నెలలుగా ఆలస్యంగా జమవుతున్నాయి. మార్చి నెలలో ఇన్‌కం ట్యాక్స్ చెల్లింపులు వంటి అంశాల నేపథ్యంలో ఆలస్యమైనా మరీ 12వ తేదీన వేతనాలు జమ చేయడం సరికాదని ఉద్యోగులు బహిరంగంగానే పేర్కొంటున్నారు.

విజయవాడ డివిజన్‌లో రైల్వే జీఎం విస్తృత తనిఖీలు



డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో కలిసి గోదావరి రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ బుధవారం విజయవాడ డివిజన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, ఇతర అధికారులతో కలిసి ముందుగా జీఎం కాకినాడ పోర్ట్ రన్నింగ్ రూమ్‌లో తనిఖీని ప్రారంభించారు. అక్కడ లోకో సిబ్బందికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించి వారితో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆయన రన్నింగ్ రూమ్ వద్ద మొక్కలు నాటారు. అక్కడ నుంచి సామర్లకోట రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయం, సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం రాజమండ్రి రైల్వే స్టేషన్ చేరుకుని అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి రైల్వే వంతెనను క్షుణ్ణంగా పరిశీలించి, రైలు పట్టాల భద్రతా అంశాలను సమీక్షించారు. నిడదవోలు స్టేషన్‌లో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పలువురు ప్రజాప్రతినిధులు జీఎంను కలుసుకుని తమ ప్రాంతాలకు సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టులపై వినతిపత్రాలు అందజేశారు. చివరిగా ఏలూరు స్టేషన్‌ను సందర్శించారు. ఈ పర్యటనలో సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

టెంపుల్, ఎకో టూరిజంపై ప్రత్యేక దృష్టి

జిల్లా పర్యాటక మండలి(డీటీసీ) సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో పర్యాటకులకు మధురానుభూతి మిగిల్చేలా ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక మండలి(డీటీసీ) సమావేశం బుధవారం జరిగింది. పర్యాటకం, ఏపీటీడీసీ, మునిసిపల్, రెవెన్యూ, దేవదాయ, ఆర్కియాలజీ-మ్యూజియమ్స్, అటవీ తదితర శాఖల అధికారులతో పాటు హోటళ్ల అసోసియేషన్, టూర్స్ అండ్ ట్రావెల్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతం జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, రోజువారీ పర్యాటకుల సంఖ్య, అందుబాటులో ఉన్న వసతులు, పర్యాటక ప్యాకేజీల రూపకల్పన తదితరాలపై చర్చించారు. జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే భాగస్వామ్య పక్షాలతో సమావేశాలు నిర్వహించామన్నారు. విజయవాడతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలను సందర్శించే పర్యాటకులకు మంచి పర్యాటక అనుభూతిని మిగిల్చేలా పర్యాటక ప్యాకేజీలను రూపొందించామని చెప్పారు. వీటిపై పర్యాటక మండలిలో చర్చించి, సభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని మార్పులుచేర్పులు చేసి అందుబాటులో ఉంచుతామన్నారు.

పలు ప్యాకేజీల రూపకల్పన..

ఒక రోజు ప్యాకేజీలో శ్రీ కనకదుర్గమ్మ ఆలయం, బేరం పార్కు, కొండపల్లి ఫోర్ట్, పవిత్ర సంగమం, భవానీ ఐలాండ్, బాపూ మ్యూజియం, గాంధీ హిల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ఉంటాయని చెప్పారు. ఇదేవిధంగా రెండు రోజులు, మూడు రోజులు, నాలుగు రోజుల ప్యాకేజీలను రూపొందిస్తామన్నారు. గైడ్ సదుపాయం కూడా కల్పిస్తామన్నారు. ఇదేవిధంగా సిటీ ప్యాకేజీ, టెంపుల్ ప్యాకేజీ, హిస్టారికల్ ప్లేసెస్ ప్యాకేజీ వంటి వాటిని కూడా దశల వారీగా అందుబాటులోకి తేనున్నట్లు వివరించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంతో పాటు జిల్లాలో వేదాద్రి, కోటిలింగ హరిహర మహాక్షేత్రం, శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, స్వయంభూ వల్మీకోద్భవ శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం, శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం తదితర ఆలయాలు ఉన్నాయని.. ఈ ఆలయాల వద్ద వసతి వంటి సౌకర్యాలు కూడా కల్పించాల్సిన అవసరముందని, తద్వారా టెంపుల్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు. నిర్మాణం పూర్తయిన కొండపల్లి షాపింగ్ కాంప్లెక్స్‌ను త్వరితగతిన అందుబాటులోకి తెచ్చేందుకు పర్యాటక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముక్త్యాల ఏపీ టూరిజం రెస్టారెంట్, గాంధీ హిల్ డిజిటల్ ప్లానిటోరియం/స్పేస్ ఆస్ట్రానమీ సెంటర్, కొండపల్లి ఫోర్ట్ లేజర్ షో, కొండపల్లి గ్రామంలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అభివృద్ధి తదితరాలపైనా సమావేశంలో చర్చించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఏపీ టీడీసీ డివిజనల్ మేనేజర్ పీఎస్ కృష్ణచైతన్య, విజయవాడ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా అటవీ అధికారి జి.సతీష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.శ్రీనివాసరావు, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్‌వీ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.